క్లుప్తంగా

జూలైలో పరాశరేశ్వర బ్రహ్మోత్సవాలు

నారాయణవనం: నారాయణవనంలో టీటీడీ అనుబంధ శ్రీచంపకవల్లీ సమేత పరాశరేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు జూలై నాలుగో తేదీ తొమ్మిది రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారి నాగరాజు తెలిపారు. జూలై మూడవ తేదీ బుధవారం సాయంత్రం అంకురార్పణ ఉంటుందని పేర్కొన్నారు. ఉత్సవాల్లో ప్రతి రోజు ఉదయం 10 గంటలకు ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం, సాయంత్రం7 గంటలకు వాహన సేవ ఉంటుందన్నారు. జూలై 13వ తేదీ ఉదయం త్రిశూల స్నానం, రాత్రి ధ్వజావరోహణంతో ఉత్సవాలు పూర్తవుతాయని నాగరాజు పేర్కొన్నారు.

బ్యాంకు ఖాతాలకు 'చేయూత'



బ్యాంకు వద్ద క్యూ కట్టిన మహిళలు

బుచ్చినాయుడుకండ్రిగ: బ్యాంకు ఖాతాలకు జమ అయిన చేయూత నగదును మంగళవారం లబ్ధిదారులు అందుకున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన చేయూత పథకం నగదును బ్యాంకు ఖాతాలకు జమ చేసింది. స్థానిక సప్తగిరి గ్రామీణ బ్యాంకు వద్ద మహిళలు నగదు తీసుకునేందుకు బారులు తీరారు.

అల్లర్లకు పాల్పడితే చర్యలు



బుచ్చినాయుడుకండ్రిగలో బందోబస్తు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా, అల్లర్లు సృష్టించినా చర్యలు తప్పవని ఎస్ఐ వెంకటనరసింహం తెలిపారు. ఆయన మంగళవారం మండలంలోని గ్రామాల్లో పర్యటించి, మైక్ ద్వారా ఎన్నికల నిబంధనలను తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 144 సెక్షన్ అమల్లో ఉందని, నలుగురి కంటే ఎక్కువ మంది గుమికూడదని పేర్కొన్నారు. ఒక పార్టీని కించపరిచే విధంగా మరో పార్టీ నాయకులు మాట్లాడినా, గొడవలకు పాల్పడినా, బాణ సంచా పేల్చినా చర్యలు తీసుకుంటామని తెలిపారు. విజయోత్సవ ర్యాలీ లు నిషేధమని, నిబంధనలను అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గుండెపోటుతో వైఎస్సార్‌సీపీ నేత మృతి



సురేష్ (ఫైల్)

వరదయ్యపాళెం: మండలంలోని రాచర్లకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు తొండా సురేష్ (49) సోమవారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతి చెందారు. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. సురేష్ మంగళవారం జరిగే ఎన్నికల లెక్కింపు ప్రక్రియను వీక్షించేందుకు సోమవారం మధ్యాహ్నమే సహచర నాయకులతో కలసి తిరుపతికి చేరుకున్నాడు. అక్కడ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎంపీ అభ్యర్థులను నేరుగా కలుసుకుని అందరితో సరదాగా ఉండి, అద్దె గదిలో నిద్రిస్తుండగా అర్ధరాత్రి ఒంటి గంటకు పైబడి ఒక్కసారిగా గుండెపోటుకు గురయ్యాడు. తిరుపతిలోని రుయా ఆస్పత్రికి తరలించేలోపే ఆయన మృతి చెందాడు. సురేష్ మరణవార్త విని అటు కుటుంబ సభ్యులు, ఇటు గ్రామస్తులు శోకసంద్రంలో మునిగిపోయారు. మృతి చెందిన సురేష్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. సమాచారం అందుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు పెద్దఎత్తున రాచర్లకు తరలివచ్చి సురేష్ మృతదేహానికి నివాళులర్పించారు.

కండలేరులో 6.602 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 6.602 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 15 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 20, లోలెవల్ కాలువకు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పెంచలకోనలో భారీ వర్షం



పెంచలకోనలో కురుస్తున్న వర్షం

రాపూరు : మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ప్రజలు ఉదయం నుంచి ఎండవేడిమి, ఉక్కపోతతో అల్లాడారు. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణంలో మార్పు కలిగి గాలి, వాన, ఉరుములతో భారీ వర్షం కురిసింది. రాపూరు తదితర గ్రామాల్లో చల్లని గాలులు వీయడంతోపాటు చిరుజల్లులు కురిశాయి. వాతావరణ చల్లపడడంతో ప్రజలు ఉపశమనం పొందారు.

శ్రీకాళహస్తి అసెంబ్లీ టీడీపీ కైవసం

రేణిగుంట: శ్రీకాళహస్తి అసెంబ్లీస్థానం టీడీపీ కైవశం చేసుకుంది. 2024 సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో మంగళవారం జరిగింది. నియోజకవర్గంలో మొత్తం 2,48,536 ఓట్లు ఉండగా, 2,06,914 మంది ఓట్లు వేశారు. వీరిలో పురుషులు 1,00982 మంది ఓట్లు వేయగా, 1,05,930మంది మహిళలు ఓటుహక్కు వినియోగించుకున్నారు. మొత్తం 21 రౌండ్లకు గాను టీడీపీ అభ్యర్థి బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డికి 1,21,565 ఓట్లు పడగా, వైఎస్సార్ సీపీ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డికి 78,261 ఓట్లు వచ్చాయి. దీంతో టీడీపీ అభ్యర్థి 43,304 ఓట్లు మెజారిటీతో గెలుపొందారు. కాగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ పోతుగుంట రాజేష్‌నాయుడుకు 3,002 ఓట్లు వచ్చాయి. గెలుపొందిన సుధీర్‌రెడ్డికి రిటర్నింగ్ అధికారి డిక్లరేషన్ అందించారు.

తొలి రౌండ్ నుంచీ ఆధిక్యం

శ్రీకాళహస్తి అసెంబ్లీ స్థానానికి జరిగిన ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఉదయం 8.30గంటలకు ప్రారంభమైంది. మొత్తం ఓట్లను లెక్కించడానికి 21 రౌండ్లు ఏర్పాటు చేశారు. శ్రీకాళహస్తి మండలంలో ప్రారంభమైన తొలి రౌండ్‌లో 14 పోలింగ్ బూత్‌లకు టీడీపీ అభ్యర్థికి 924 ఓట్లు మెజారిటీ వచ్చాయి. ఆపై ప్రతి రౌండ్‌లోనూ ఆయన మెజారిటీ కొనసాగించారు. చివరి రౌండ్ పూర్తయ్యే సరికి పోస్టల్ బ్యాలెట్ ఓట్లతో కలుపుకుని 43,304 ఓట్లు మెజారిటీ సాధించారు.



డిక్లరేషన్ అందుకుంటున్న బొజ్జల సుధీర్‌రెడ్డి



డిక్లరేషన్ అందుకుంటున్న ఆదిమూలం

ఎవరికెన్ని ఓట్లు పడ్డాయంటే...(శ్రీకాళహస్తి)

బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి(టీడీపీ)	1,21,565
బియ్యపు మధుసూదన్‌రెడ్డి(వైఎస్సార్‌సీపీ)	78,261
పోతుగుంట రాజేష్‌నాయుడు(కాంగ్రెస్)	3,002
కుంట్రపాకు సురేంద్రబాబు(బీఎస్పీ)	1,397
కె.దినార్‌బాబు(బీసీవై పార్టీ)	545

సత్యవేడులో ఆది నుంచి హోరాహోరీ

సత్యవేడు నియోజకవర్గ సార్వత్రిక ఎన్నికల లెక్కింపు ప్రక్రియ తొలి రౌండ్ నుంచి చివరి వరకు హోరాహోరీ పోటీ కొనసాగింది. బీఎన్‌కండ్రిగ మండలం తిమ్మిభూపాలపురం బూత్ నుంచి ఎన్నికల లెక్కింపు మొదలైనప్పటికీ మొదటి రెండు రౌండ్లు టీడీపీ అభ్యర్థికి ఆధిక్యం వచ్చినప్పటికీ అక్కడి నుంచి 16వ రౌండ్ వరకు ఇద్దరి మధ్య హోరాహోరీ పోటీ నెలకొంది. పలు రౌండ్లలో రాజేష్‌కు ఆధిక్యత లభించింది. 17వ రౌండ్ నుంచి చివరి 20వ రౌండ్ వరకు టీడీపీకి మెజారిటీ రావడంతో 3739 ఓట్ల మెజారిటీతో ఆదిమూలం విజయం సాధించారు. కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్ గల్లంతైంది. ఆ పార్టీ నుంచి పోటీ చేసిన బాలగురవం బాబుకు 5444 ఓట్లు వచ్చాయి. మరో 12 మంది ఎన్నికల బరిలో గెలిచినప్పటికీ వారి ప్రభావం ఏమాత్రం లేదు.

సత్యవేడులో ఎవరికెన్ని ఓట్లు పడ్డాయంటే...:

కోనేటి ఆదిమూలం	(టీడీపీ)	85,471
నూకతోటి రాజేష్	(వైఎస్సార్‌సీపీ)	81,732
పోస్టల్ బ్యాలెట్	(టీడీపీ)	845
	(వైఎస్సార్‌సీపీ)	421
	(కాంగ్రెస్)	20

ప్రజాతీర్పును గౌరవిస్తా

- కార్యకర్తలకు అండగా ఉంటా
- ఎప్పటికీ శ్రీకాళహస్తి ప్రజలతోనే..
- రాజకీయాల్లో గెలుపోటములు సహజం
- బియ్యపు మధుసూదన్‌రెడ్డి



బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: 'ఎన్నికల్లో గెలుపోటములు సహజం..ప్రజా తీర్పును గౌరవిస్తా..ఓటమి చెందినా శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రజలతోనే ఉంటా' అని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. కౌంటింగ్ పూర్తయిన తర్వాత తిరుపతి పద్మావతి కళాశాల వద్ద మంగళవారం ఆయన నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంతో రాజకీయ అనుభవం ఉన్న నేతలు కూడా ఓడిన సందర్భాలు శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఉన్నాయన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసిందని తెలిపారు. తాను ఎమ్మెల్యేగా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సొంత నిధులతో సేవా కార్యక్రమాలు నిర్వహించానని పేర్కొన్నారు. కరోనా విపత్కర సమయంలో ప్రాణాలకు తెగించి సొంత నిధులు రూ.కోట్లు వెచ్చి ప్రజలకు అండగా నిలిచి అనేక సహాయ కార్యక్రమాలు చేశా నని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఎన్నో ఆల యాలకు జీర్ణోద్ధరణ, కుంభాభిషేకాలు నిర్వహించినట్లు చెప్పారు. ఎన్నడూ లేని విధంగా మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను నిర్వహించామన్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే చాలా ఉన్నాయని తెలిపారు.కానీ నియోజకవర్గ ప్రజలు ఇంకా ఏదో ఆశించి కూటమిని ఆదరించినట్లు ఫలితాలు తేటతెల్లం చేశాయన్నారు. రాష్ట్రస్థాయిలో ఎన్నికల ట్రెండ్ కూడా కూటమికి అనుకూలించాయని పేర్కొన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను టీడీపీ తప్పకుండా నెరవేర్చాలన్నారు. ఇకపై ప్రజల పక్షాన వారి సమస్యలపై పోరాడేందుకు తాము సిద్ధంగా ఉంటామని తెలిపారు. టీడీపీవారు గెలిచిన ఆనందంలో ఉన్నారని, వారు రెచ్చగొట్టే చర్యలకు దిగినా వైఎస్సార్ సీపీ కుటుంబీకులు సమయమనం పాటించాలని తెలిపారు. అనవసరమైన గొడవల కారణంగా మానసిక అశాంతి అవసరం లేదన్నారు. ఏదీ ఏమైనా ప్రజా తీర్పే ప్రజాస్వామ్యంలో శిరోధార్యం కాబట్టి తాము టీడీపీ గెలుపును స్వాగతిస్తున్నామని, ప్రజలకు మేలు చేయాలని సూచించారు. బొజ్జల సుధీర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపా రు.తెలుగుదేశం పార్టీ ఇచ్చిన హామీలను గతంలో కాకుండా నెరవేర్చాలని మధుసూదన్‌రెడ్డి సూ చించారు. తెలుగుదేశం పార్టీ ఇచ్చిన హామీలను గతంలో కాకుండా నెరవేర్చాలని మధుసూదన్‌రెడ్డి సూ చించారు.

సత్యవేడు ప్రజలకు అందుబాటులో ఉంటా

- స్వల్ప తేడాతో ఓటమి చెందాను..
- ప్రజా తీర్పును గౌరవిస్తా
- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్



నూకతోటి రాజేష్

వరదయ్యపాళెం: 'ఎన్నికలకు 60 రోజుల ముందు నన్ను సత్యవేడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వ యకర్తగా పార్టీ అధిష్టానం నియమించింది.. అతి తక్కువ రోజుల్లోనే ప్రజలు, పార్టీ శ్రేణులు గొప్పగా ఆదరించారు.. స్వల్ప తేడాతో ఓటమి చెందాను.. అయినా ప్రజల తీర్పును శిరసావహించి నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటా' అని సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ తెలిపారు. కౌంటింగ్ పూర్తయిన అనంతరం మంగళవారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ రాజకీయాల్లో గెలుపోటములు సహజమేనన్నారు. ఎంతో రాజకీయ అనుభవం ఉన్నా సీనియర్ నాయకులు సైతం ఓటమి చెందిన సందర్భాలు ఉన్నాయని తెలిపారు. అయినా నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటానని, ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో ముందుంటానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సత్యవేడు నుంచి గెలుపొందిన టీడీపీ అభ్యర్థి ఆదిమూలంకు శుభాకాంక్షలు తెలిపారు. ఓటమి బాధలో ఉన్న నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ శ్రేణులు సంయమనం పాటించాలని సూచించారు. కార్యకర్తలకు, పార్టీ నాయకులకు అండగా ఉంటానని పేర్కొన్నారు.

సురుటుపల్లెలో వైభవంగా ప్రదోష పూజలు



నందీశ్వరునికి విశేష హారతి

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లిలో ప్రసిద్ధ శ్రీ పళ్లికొండేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ప్రదోష పూజలు అత్యంత వైభవంగా జరిగాయి. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి సర్వమంగళ సమేత పళ్లికొండేశ్వరస్వామిని దర్శించుకున్నారు. సాయంత్రం ప్రదోష సమయంలో ప్రధాన అర్చకులు కార్తికేశన్ గురుక్కల్, సతీష్ శర్మ, గణేష్ శర్మ ఆధ్వర్యంలో నందీశ్వరుడికి, వాల్మీకేశ్వరుడికి ఏక కాలంలో అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. ఈ ప్రదోష పూజల ఊత్తుకోట్టైకి చెందిన గణేశన్ ఉభదారుగా వ్యవహరించారు. ఆలయ కార్య నిర్వాహణ అధికారి కె.రామచంద్రారెడ్డి, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

మృతి చెందిన వ్యక్తి నేత్రాల సేకరణ



కొండయ్య(ఫైల్)

చిల్లకూరు : మృతిచెందిన వ్యక్తి నేత్రాలను కుటుంబ సభ్యుల సహకారంతో సునీతా సేవా సంస్థ ఆధ్వర్యంలో నెల్లూరులోని మోడ్రన్ ఐ కేర్ ఆస్పత్రి వారు మంగళవారం సేకరించారు. గూడూరు పట్టణంలోని కుమ్మరివీధికి చెందిన పేటేటి కొండయ్య (89) మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న సునీతా సేవా సంస్థ నిర్వాహకులు కొండయ్య కుటుంబ సభ్యులైన రమేష్‌ను సంప్రదించి నేత్ర దానం చేసేలా ఒప్పించారు. అటు తరువాత మోడ్రన్ ఐ కేర్ ఆస్పత్రి వారికి సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి నేత్రాలను సేకరించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు సారంగం శ్రీనివాసులు మాట్లాడుతూ మృతిచెందిన తరువాత మట్టిలో కలసిపోయే నేత్రాలను కుటుంబ సభ్యులు ముందుకు వచ్చి దానం చేస్తే రెండు కళ్లు నలుగురికి ఉపయోగపడతాయన్నారు. ఎవరైనా నేత్రదానం చేయాలనుకునే వారు 9440455947, 9490560404కు సమచారం ఇవ్వాలని కోరారు.

గంగమ్మకు కరెన్సీ నోట్ల అలంకరణ

- భక్తులతో కిటకిటలాడిన ఆలయం



కరెన్సీ నోట్లతో ధనలక్ష్మి అలంకరణలో దర్శనమిస్తున్న శ్రీతాతయ్యగుంట గంగమ్మ

తిరుపతి కల్చరల్: కరుణించి కాపాడు... తల్లీ అంటూ భక్తజనం మంగళవారం సర్వాంగసుందర అలంకరణలో కొలువైన శ్రీతాతయ్యగుంట గంగమ్మను కోరి ప్రార్థించారు. పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించి అమ్మవారి పాదాల వద్ద ప్రణమిల్లి ప్రార్థించారు. తిరుపతి గంగజాతర తర్వాత ఐదు మంగళవారాలు గంగమ్మకు భక్తులు మారు పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీ. ఇందులో భాగంగా గంగ జాతర తర్వాత వచ్చిన రెండో మంగళవారం వేకువజాము నుంచే భక్తులు కుటుంబ సభ్యులతో కలిసి ఆలయానికి వచ్చి పొంగళ్లు పెట్టడం ఆరంభించారు. పొంగళ్లు నైవేద్యంగా అమ్మవారికి సమర్పించి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల రద్దీతో శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయం కిక్కిరిసింది. రెండో మంగళవారం కావడంతో ఆలయంలో అమ్మవారి మూలవిరాట్టు విగ్రహానికి అభిషేకం చేశారు. అనంతరం వివిధ కరెన్సీ నోట్లు పుష్పాలతో గంగమ్మ తల్లిని ధనలక్ష్మీ రూపంలో సర్వాంగ సుందరంగా అలంకరించి, కొలువుదీర్చి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. జాతరలో వేషాల మొక్కులు చెల్లించని భక్తులు, మంగళవారం చిన్నాపెద్దా తేడా లేకుండా భక్తులు భక్తి శ్రద్ధలతో వేషాలు ధరించి ఆలయ ప్రదక్షిణ చేసి అమ్మవారికి మొక్కులు చెల్లించారు. మొక్కుబడిలో భాగంగా భక్తులు ఆలయం వద్ద భక్తులకు అంబళ్లు పోసి, ప్రసాదాలు పంచి పెట్టారు. ఆలయ ఈఓ కె.మమత, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.





ఆలయ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు



పొంగళ్ల సమర్పణ

కౌంటింగ్ వేళ బయటకురాని జనం



నిర్మానుష్యంగా ఉన్న ఆస్పత్రి రోడ్డు



టవర్ క్లాక్ సెంటర్‌లో బందోబస్తు

గూడూరు రూరల్ : 2024 ఎన్నికల అనంతరం కౌంటింగ్ ఎప్పుడు జరుగుతుందోనని ఎదురు చూసిన ప్రజలు మంగళవారం ఎన్నికల కౌంటింగ్ మొదలైనప్పటి నుంచి బయటకు రాకుండా ఇళ్లకే పరిమితమయ్యారు. నిత్యం రద్దీగా ఉండే బజారు వీధి, ముత్యాలపేట రోడ్డు, ఆస్పత్రి రోడ్డు మంగళవారం ప్రజలు లేక నిర్మానుష్యంగా మారాయి. దీనికితోడు విజయావకాశాలు ఉండే పార్టీల నాయకులు, కార్యకర్తలు ముందుస్తుగా బాణసంచా కాల్చి సంబరాలు చేసుకుంటే వివాదాలు ఏర్పడే అవకాశం ఉందని పోలీసులు ఎక్కడిక్కడ బందోబస్తును పటిష్టం చేశారు. ఈ క్రమంలో రైల్వే స్టేషన్, బజారు వీధి, సంగం థియేటర్, ఆస్పత్రి రోడ్డు, గాంధీబొమ్మ కూడలి, బనిగేసాహెబ్ పేట, ప్రముఖుల ఇళ్ల వద్ద భారీ బందోబస్తు నిర్వహించారు. దీంతో కౌంటింగ్ రోజున గూడూరులో కర్ఫ్యూ విధించినంట్టు కనిపించింది.

లోతు దుక్కులకు ఇదే అదును

వేసవి.. పొలాల్లో పంటలు లేని సమయం. రైతులకు పొలం పనులు లేవనుకుంటారు. కానీ అతి ముఖ్యమైన పొలం పనులు చేపట్టాల్సింది వేసవిలోనే. ఖరీఫ్ సీజన్‌కు ఇప్పటి నుంచే సమాయత్తం కావాల్సిన అవసరం ఉంది. వేసవిలో చేసుకునే పొలం పనులను బట్టే పంటల పెరుగుదల, దిగుబడులు వస్తాయని సత్యవేడు ఏడీఏ సుబ్రమణ్యం తెలిపారు. వివరాలు అధికారి మాటల్లోనే..

- పొలాల్లో గొర్రెల మంద కట్టడం వల్ల సేంద్రియ పదార్థాన్ని పెంచుకోవచ్చు
- చెరువు మట్టితో అనేక ఉపయోగాలు
- సత్యవేడు వ్యవసాయ శాఖ ఏడీ సూచనలు



కీళపూడిలో పొలంలో గొర్రెల మంద



రామాపురంలో దుక్కిదున్నుతున్న రైతు

పిచ్చాటూరు: ఇటీవల అకాల వర్షాలు కురవడంతో పాటు మరో ఒకటి రెండు రోజుల్లో రుతుపవనాల ప్రవేశంతో వర్షాలు పడనున్నట్లు వాతావరణ శాఖ వెల్లడించిన తెలిసిందే. ప్రస్తుతం సరిపడ తేమ ఉన్న పొలాల్లో లోతు దుక్కులు దున్నాలి. ఈ దుక్కుల లోతు సుమారు 9 అంగుళాలకు తగ్గకుండా ఉండాలి. అలా లోతు దుక్కులు వేసవిలో చేసినప్పుడు పలు రకాల ప్రయోజనాలు చేకూరుతాయి. వాలుకు అడ్డంగా దున్నుకోవడం వల్ల వర్షపు నీరు భూమిలోకి బాగా ఇంకిపోతుంది. వేసవిలో భూములకు ప్రధానంగా చెరువు మట్టి పంటలకు అవసరమైన స్థూల, సూక్ష్మ పోషకాలతో పాటు సేంద్రియ కర్బనం బాగా లభిస్తుంది. చీడపీడలు నశిస్తాయి. లోతు దుక్కులు దున్నే సమయంలో నేలపై పొరల్లో ఉండే పురుగులను, తెగుళ్ల నశించే అవకాశం ఉంది. లోతుగా దున్నినప్పుడు నేలలో నిద్రావస్థలో ఉండే పురుగులు, నేలలో ఉండి తెగుళ్లను కలగజేసే శిలీంద్రాలు, ఎండల బారిన పడి నశిస్తాయి. అందువల్ల ఈ వేసవి కాలంలో పంట కోతలు పూర్తయిన వెంటనే లోతు దుక్కులు చేసుకుంటే తొలకరిలో విత్తుకునే పంటకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

పశువులు, గొర్రెల మంద కట్టడం..

ఈ పని కూడా రైతులు వేసవిలో చేసుకోవచ్చు. లోగడ ప్రతి రైతుకు ఎద్దులు, ఆవులు, గేదెలు ఉండేవి. వాటిని రాత్రిళ్లు పొలంలో కట్టేసేవారు. వాటి మలమూత్రాలు సేంద్రియ ఎరువుగా పంటలకు ఉపయోగపడేవి. ఇందువల్ల ఎరువుల ఖర్చు తగ్గేది. ఇప్పుడు పశుగణాలు తగ్గిపోయాయి. పశుగణం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఈ పని ఇప్పటికైనా చేసుకోవచ్చు. గొర్రెలను పొలంలో మందకట్టడం రైతులకు పరిపాటే. ఈ పని ఎండా కాలంలోనే చేయాలి. నిద్రలో ఉన్న గొర్రెల మందలను రాత్రిళ్ళు ఎక్కువసార్లు లేపితే ఎక్కువసార్లు పెండికలను వేస్తాయి. దీనివల్ల చేనుకు అవసరమైనంత సేంద్రియ ఎరువు లభ్యమౌతుంది.

మొండి జాతి కలుపు నివారణ

తొంగ, గరిక, దుబ్బ వంటి మొండి జాతి కలుపు మొక్క పొలంలో పెరిగి నష్టం కలగ జేస్తుంటాయి. వేసవిలో దుక్కి బాగా దున్నినప్పుడు ఈ కలుపు మొక్కల కాయలు, వేర్లు దుంపలు పెకిలించుకుని వస్తాయి. అధిక ఉష్ణోగ్రతలకు ఇవి నశించేందుకు అవకాశం ఉంది. నేలపైకి తేలిన కాయలు, దుంపలు, వేర్లను ఏరివేసుకొని వీటిని అరికట్టవచ్చు.

సేంద్రియ పదార్థం నేలలో కలుస్తుంది..

పంటల కోతల తర్వాత నేలపై మిగిలే పంట మొదళ్లు, పొలంలో మిగిలిన కలుపు మొక్కలు, పంటల నుంచి రాలిపడిన ఆకులు వంటి వివిధ సేంద్రియ పదార్థాలన్నీ లోతు దుక్కి దున్నినప్పుడు నేలలో కలిసి కుళ్లిపోతాయి. అందువల్ల నేలలో సేంద్రియ పదార్థాలు పోషక విలువలు పెరిగేందుకు అవకాశం ఉంది.

పశువుల ఎరువులను తోలడం

సంవత్సరం పొడవునా నిలువ చేసిన పశువుల ఎరువులను ఎండాకాలంలోనే పొలాల్లోకి తోలాలి. వర్షాలు పడిన తర్వాత పొలాలకు తోలిన పశువుల ఎరువులను నేలపై చల్లి లోతు దుక్కి దుక్కితే మట్టిలో బాగా కలుస్తుంది. దీనివల్ల పంటలకు అవసరమైన పోషకాలు అందుతాయి.

తొలకరిలో సకాలంలో విత్తుకోవచ్చు

వేసవిలో లోతు దుక్కిలు దున్నినప్పుడు పొలంలో కలుపు, గత పంట అవశేషాలు లేకుండా నేల శుభ్రంగా ఉంటుంది. అందువల్ల తొలకరి వర్షాలకు నేలలో గొర్రు తిప్పి గుంటకలతో పోసుకుని పంటలను ఆలస్యంగా కాకుండా సకాలంలో విత్తుకునేందుకు వీలు కలుగుతుంది.

కాంగ్రెస్‌కంటే నోటాకు పెరిగిన ఓట్లు

చిల్లకూరు : ఎన్నికల్లో ఎవరికీ ఓటు వేయకూడదని నిర్ణయించుకునే వారు నోటాకు ఓటు వేస్తుంటారు. ఈ క్రమంలో సార్వత్రిక ఎన్నికల్లో ప్రధాన పార్టీ కాంగ్రెస్‌కు దాదాపు ఓటర్లు నోటాకు ఓట్లు వేసినట్లు తెలుస్తుంది. ఎన్నికల ఫలితాలు పూర్తిగా వెలువడిన తర్వాత కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి 3,276 ఓట్లు రాగా, ఎవరిపై నమ్మకం లేదని తెలియజేసేలా ఓటర్లు నోటాకు వేసిన ఓట్లు 3,119గా నమోదు అయ్యాయి.

ఎన్‌ఎంఎంఎస్‌లో విద్యార్థుల ప్రతిభ

పెళ్లకూరు : జాతీయ ఉపకార వేతనం పరీక్ష (ఎన్‌ఎంఎంఎస్) ఫలితాల్లో తాళ్వాయిపాడు, చెంబేడు, పాలచ్చూరు, నెలబల్లి పాఠశాలల విద్యార్థులు ప్రతిభ చూపారు. తాళ్వాయిపాడు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన వంకపూరి నేత్విక, మేకల అంకిత, పాగల దినేష్‌రెడ్డి, చెంబేడు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన లొక్కు గురుచరణ్, అంజూరు తేజశ్రీ, సమాధి తనూషా, పిన్నాబత్తిన వర్షిణి, పుట్టు గురువిష్ణు, పాలచ్చూరుకు చెందిన శ్రావ్య, నెలబల్లికి చెందిన హర్ష ఎన్‌ఎంఎంఎస్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి ఉపకార వేతనానికి ఎంపికయ్యారు.

కర్ఫ్యూను తలపించిన వీధులు

నాయుడుపేట టౌన్ : ఓట్ల లెక్కింపు సందర్భంగా నాయుడుపేట పట్టణంలో జనాలతో కిటకిటలాడే ప్రధాన వీధులు సైతం కర్ఫ్యూను తలపించాయి. పట్టణంలోని బజారు వీధులు, ప్రధాన కూడళ్లలో సైతం దుకాణాలు మూసి వేయడంతో లాక్‌డౌన్‌ను తలపించింది. జనాలు ఇళ్ల నుంచి బయటటకు రాలేదు.